

అధికారులు అప్రమత్తం

పార్వతీపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్ చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఈదురుగాలులు కారణంగా నేలకొరిగిన చెట్లు తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండాచూడాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సరఫరాతో పాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులకు ఆదేశించారు.

గాలివాన బీభత్సం — రైతన్న అతలాకుతలం

- 2500 ఎకరాల్లో నేలకొరిగిన అరటి
- మొక్కజొన్న, వరి,పత్తి పంటలకూ నష్టం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కురుపాంలో నేలకొరిగిన అరటి పంట



ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన కుండపోత వర్షాలు, ఈదురుగాలులకు భారీగా పంట నష్టం వాటిల్లింది. ఈ మేరకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంట నష్టం అంచనాల్లో వున్నారు. జిల్లాలో అత్యధికంగా ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వీరఘట్టం మండలంలో అధికంగా 72 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గరుగుబిల్లి మండలంలో తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 5 సెంటీమీటర్లుగా నమోదైంది. భారీ వర్షాలతో పాటు బలంగా ఈదురుగాలులు వీడయంతో అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. జిల్లా అంతటా సుమారు 2500 ఎకరాల్లో అరటి తోటలు నేలకొరినట్లు ఉద్యానవన అధికారులు తెలిపారు. అధికంగా వర్షపాతం నమోదైన వీరఘట్టం మండలంలో ఎక్కువగా సుమారు 1000 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లింది. సాలూరు మండలంలో 500 ఎకరాల్లో, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో 500, మక్కువ, సీతానగరం మండలాల్లో 250 ఎకరాల్లో అరటి తోటలు నేలకొరినట్లు ఉద్యానవన అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇవే కాక మొక్కజొన్న పంటలకు కూడా భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. భారీ వర్షాలకు పలుచోట్ల వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నాగావళి నది ఉధృతంగా ప్రవహించడం జియ్యమ్మవలస మండలంలోని తోటపల్లి నిర్వాసిత గ్రామమైన బాసంగి ముంపునకు గురైంది. కొమరాడ మండలం కల్లికోట జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఈదురు గాలులకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, వీరఘట్టం, సాలూరు, భామిని, పాచిపెంట మండలాల్లో మొక్కజొన్న, అరటి నేలమట్టమయ్యాయి. సాలూరు మండంలోని భారీ వృక్షాలు రోడ్డుపై నేలకొరగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కురుపాం మండలం ఉదయగిరిలో ఇంటి గోడ కూలి ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే గుమ్మలక్ష్మీపురంలో ఆరుగ్రామాల్లోనూ, కురుపాం మండలంలోని కుంబికోటలో ఇళ్ల గోడలు కూలిపోయాయి. వరద బాధిత ప్రాంతాల్లో కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు పర్యటించారు. తోటపల్లి ముంపు గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు.

కురుపాం : మండలంలో గల పూతికవలస, సీతంపేట తదితర గ్రామాల్లో సుమారు 400 ఎకరాల అరటి పంట నేలకొరగా, బియ్యాలవలస తదితర గిరిజన గ్రామాల్లో పత్తి, జీడి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. వరి పొలాలు నీటిమనగ్గా ఎక్కడికక్కడ రహదారిపై ఉన్న చెట్లు విరిగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడి రాకపోకలకు, తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాకితాడ, రావాడ రాంభద్రపురం తదితర గిరిజన గ్రామాల్లోని ప్రధాన రహదారిపై గెడ్డలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి కొంత వరద నీరు ఉధృతి తగ్గడంతో రాకపోకలు సాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పంట నష్టాన్ని సర్వే చేసి అంచనా వేసి నష్టపరిహారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పలు గిరిజన గ్రామాల ప్రజలు రహదారి సమీపంలో ఉన్న గెడ్డలు, వాగులు ఎప్పుడు వర్షాలు పడినా ఉధృతంగా ప్రవహించి తమ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, నిత్యవసరాలు, అనారోగ్య సమస్యలప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనలు నిర్మించి రాకపోకలు సాగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నేలకొరిగిన అరటిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బియ్యాలవలసలో నేలకొరిగిన పత్తి పంటను ఎమ్మెల్యే పరామర్శ

మండలంలో పూతికవలస, సీతంపేట, గదభవలస గ్రామాల్లో నేలకు ఒరిగిన అరటి పంటలను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం పంట పొలాలు వద్దకు వెళ్లి పడిపోయిన అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తక్షణమే మండలంలో నష్టపోయిన ప్రతి రైతు వద్దకు వెళ్లి వారు నష్ట పోయిన పంట సర్వే చేపట్టి సమగ్ర నివేదిక అందజేయాలని, ఆ నివేదికను మంత్రికి అందజేసి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ఎఒ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారి సాంబమూర్తి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖకు రూ.30లక్షల మేరకు నష్టం

పార్వతీపురం: డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు, ఈదురుగాలులకు విద్యుత్ శాఖకు 30లక్షల మేర నష్టం వాటిల్లినట్టు ఇఇ వేణుగోపాలరావు నాయుడు చెప్పారు. ఈదురుగాలులకు 128 విద్యుత్ స్తంభాలు పాక్షికంగా, పూర్తిగా నేలకొరిగాయని తెలిపారు. 33 కెవి ఫీడర్లు, 11 కెవి ఫీడర్లకు జరిగిన నష్టం కారణంగా చాలా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, వెంటనే సిబ్బంది సరఫరా పునరుద్ధరించినట్లు చెప్పారు.

బాసంగిని సందర్శించిన సబ్ కలెక్టర్

నిర్వాసిత గ్రామమైన బాసంగిని పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ముంపునకు గురైన పరిసర ప్రాంతాల పరిస్థితిని సమీక్షించారు. బాధితులతో మాట్లాడారు. తమను అన్ని విధాలా ఆదుకోవాలని, ముంపు ప్రాంతం నుంచి తరలించాలని సబ్ కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు.

ఆరు గ్రామాల్లో నేల మట్టమైన ఇంటి గోడలు

గుమ్మలక్ష్మీపురం : తపాను వర్షం, ఈదురు గాలుల ప్రభావం గిరిజన ప్రాంతంపై ఎక్కువగా చూపింది. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో ఆరు గ్రామాల్లో పలు ఇళ్ల గోడలు నేలమట్ట మయ్యాయి. రాయగడ జమ్మూ పంచాయతీ పెంగవలో పత్తిక దుంబమ్మ ఇంటి మట్టి గోడలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. పి.ఆమిటి పంచాయతీ కారివలసలో మండంగి సుగుణ ఇంటి గోడ కూలి ధ్వంసమైంది. నెల్లికెక్కువ పంచాయతీ వాడపుట్టి, కేదారిపురం పంచాయతీ సెంటర్‌గూడలో ఇంటి గోడలు కులాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాయకష్టం చేసుకుని అష్టకష్టాలు పడుతూ జీవనం సాగిస్తున్న సమయాన గూడు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలామని గిరిజనులు కన్నీటి పర్యంతమయ్యారు.

200 ఎకరాల్లో నేలకొరిగిన మొక్కజొన్న , పాడైన కంది, మిరప

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లోవ ముఠాలో 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట ఈదురు గాలులకు నేలకొరిగింది. కొత్తవలస, లావ, లోవ లక్ష్మీపురం, విశ్వనాధపురం, గాంద్ర, బుడ్డెమ్మ ఖర్జ, దొరజమ్ము గ్రామాల్లో చేతికి అంది వచ్చిన మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాణిజ్య పంటలు వేసి ఆర్థికంగా అభివృద్ధి చెందుతామన్న గిరిజన రైతుల ఆశలు అడియాశల య్యాయి. అలాగే పోడులో వేసిన కంది, మిరప, కూరగాయల పంటలను రైతులు నష్టపోయారు. ఆరుకాలం కష్టించి, వేలాది రూపా యలు అప్పులు చేసి వేసుకున్న పంటలు తుఫానుకు నష్టపోయా యని ఆందోళన చెందుతున్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

వీరఘట్టం : మండలం లోని గురువారం బీభత్స మైన వర్షంతో పాటు భయంకరమైన గాలుల కారణంగా వాగులు వంకలు పొంగి, పొర్లడంతో పాటు అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిలింది. కంబర, కంబరవలస, చిట్టిపూడివలస, దశమంతపురం, నడిమికెళ్ల పంటలు నేలకొరి గాయి. దీంతో అన్నదాతలు కన్నీరు, మున్నీరు విలపిస్తున్నారు.

నర్సిపురంలో కూలిన రేకుల ఇల్లు



నాగావళి లో ముంపునకు గురైన గుంపస్వామి ఆలయం

పార్వతీపురం:గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నర్సిపురం చిన్న వీధిలో మూడడ్ల కూర్మారావు రేకుల ఇల్లు కూలిపోయింది. ఇంటి గోడలు నాని పోవడంతో రేకుల ఇల్లు గురువారం కూలిపోయింది. కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

జలదిగ్బంధంలో కల్లికోట

కొమరాడ: మండలంలోని కల్లికోట చుట్టూ నాగావళి నది ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం చుట్టూ వరదనీరు పోటెత్తింది. దీంతో గ్రామస్తులు జలదిగ్బంధంలో ఉండిపోయారు. గురువారం సాయంత్రం నుంచి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో గ్రామం చుట్టూ పరిసర ప్రాంతాలు వరదనీరు పోటెత్తి నిలువుండిపోయింది. దీంతో గ్రామంలోని ప్రజలు బయటకు వెళ్లాలన్నా, గ్రామంలోకి రావాలన్నా అవకాశం లేకుండా పోయింది. నాగవల్లి నదిలో నీటి ప్రవాహం తగ్గితే తప్ప బయటకు వచ్చే పరిస్థితి లేదని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తోటపల్లి బ్యారేజ్ వద్ద గేట్లు ఎత్తివేస్తే తమ గ్రామానికి ముంపు ఉండదని గ్రామస్తులు తెలుపుతున్నారు.

గోడకూలి ఒకరు మృతి



మృతి చెందిన అరవింద్

కురుపాం : మండలంలో ఉదయపురం పంచాయతీ ఉదయపురం కాలనీలో గోడకూలి ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం గురువారం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు మిద్దె ఇంట్లో నివాసముంటున్న కుంబురుక అరవిందు, కుంబురుక వినాయకరావు అన్నదమ్ములపై మీద గోడ కూలిపోయింది. దీంతో వీరిని స్థానికులు భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అరవింద్ (28) తలకు తీవ్రమైన గాయాలవ్వడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు, వినాయకరావుకు వైద్యమందిస్తున్నారు. అరవింద్ డిగ్రీ పూర్తి చేసి కుటుంబానికి భరోసాగా ఉంటాడ నుకొనే సమయంలో ఇలా మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంభికోటలో కూలిన ఇంటిగోడ

మండలంలో పాలెం పంచాయితీ కుంభికోటలో గురువారం ఇంటిగోడ కూలిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు మేరకు గ్రామానికి చెందిన పువ్వుల కాంతమ్మకు చెందిన ఇంటి గోడ నేలమట్టమైంది. ఆ సమయం లో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

మునిగిపోయిన పంటలు

నాగావళి నది నీటి ప్రవాహం భారీగా పెరగడంతో పంట పొలాలు మునిగిపోయాయి. మండలంలో గంప, దళాయిపేట, కల్లికోటలో అరటి తోటలు విరిగి నేలమట్టమ య్యాయి. ఇటు నాగావళి నది, అటు గుమ్మిడిగెడ్డ పొంగడంతో వరి, పత్తి, మొక్క, పామాయిలు పంటలు నీట మునిగిపోయాయి.

తప్పిన పెను ప్రమాదం

ఈదురుగాలులకు మండలంలోని పెదఖేర్జలలో గల హాస్టల్‌పై భారీ వృక్షం పడిపోయాయి. దీంతో ప్రహరీ గోడ కూలిపోయింది. స్కూల్ బాత్ రూమ్‌లపై చెట్టు పడడంతో ఇవి నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని పాఠశాల డిప్యూటీ వార్డెన్ సీతారాం తెలిపారు.



గుమ్మలక్ష్మీపురం : నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు



ముంపునకు గురైన బాసంగి గ్రామం

ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నాగావళి నది ఉగ్రరూపం దాల్చింది. కూనేరు నుంచి కలికోట వరకు ఉన్న నాగావళి నది పరివాహక ప్రాంతమంతా ఆందోళనకర పరిస్థితి ఏర్పడింది. ఒడిశాలో విస్తారంగా పడుతున్న వర్షాలు నేపథ్యంలో నాగావళి నది నీటిప్రవాహం భారీగా పెరిగి ఉగ్రరూపం దాల్చింది. జంఝావతి, నాగావళి నదుల సంగమంలో వెలసిన గుంప సోమేశ్వర స్వామి ఆలయం పూర్తిగా మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. కోటిపాము కాలనీ నుంచి ఏర్పాటు చేసిన రహదారి ఆలయ సమీపంలో ఉన్న గట్టు పూర్తిగా కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తులో ఈ ఆలయానికి రాకపోకలు చేసేందుకు ఈ గట్టు ఎంతో కీలకంగా ఉన్నప్పటికీ నదిలో నీటి ప్రవాహం పెరగడంతో గట్టు మొత్తం కొట్టుకుపోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరద గ్రామాల్లో పర్యటించిన ప్రభుత్వ విప్

నాగావల్లి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నాగావళి ముంపు ప్రాంతాలైన కల్లికోటను శుక్రవారం సందర్శించారు. ముంపునకు గురైన వరి, పత్తి, ఉద్యాన పంటలు పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులకు నష్టపరిహారం కోసం, తగు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో తాగు నీటికి క్లోరినేషన్, శానిటేషన్ చేయాలని, మెడికల్ క్యాంప్, వెటర్నరీ క్యాంప్ నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు, ప్రధాన కార్యదర్శి కిషోర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి త్రినాథం తదితరులు పాల్గొన్నారు

సాలూరు: మండలంలో గురువారం వీచిన ఈదురు గాలులకు తోనాం, మావుడి, ఎరగడవలస, భూర్జ, కొట్టుపరువు, కొత్తవలస, కురుకుట్టి ప్రాంతాల్లోని సుమారు 260 ఎకరాల్లో అరటిపంట నేలమట్టమైంది. అలాగే బూర్జ, కొట్టుపరువు, కొత్తవలస, కందుల పదం గ్రామాలలో సుమారు 25 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేక చీకట్లోనే గ్రామస్తులు కాలం వెల్లదీస్తున్నారు.

2240 ఎకరాల్లో మొక్కజొన్న, వరి, పత్తి పంటలకు నష్టం

పార్వతీపురం: జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు, ఈదురుగాలులకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. 2240 ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, వరి పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. 84 గ్రామాల్లో 1681 మంది రైతులకు సంబంధించిన పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. భామిని మండలంలో కురిసిన వర్షాలకు 820 ఎకరాల్లో వరి, 410 ఎకరాల్లో పత్తి, 220 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.

నిర్వాసితులకు పరిహారమివ్వాలి

- వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి
- బాసంగి నిర్వాసిత గ్రామాన్ని సందర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తోటపల్లి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి, తుఫానుకు దెబ్బతిన్న ఇళ్ల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. తుఫాను వర్షం కారణంగా నాగావళి నది పొంగి ముంపునకు గురైన జియమ్మవలస మండలం బాసంగి గ్రామాన్ని సిపిఎం నాయకులు శుక్రవారం సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు ప్రారంభించి 22 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందించలేదని అన్నారు. బాసంగిలో గత 7,8 ఏళ్ల నుంచి ప్రతి ఏటా ముంపు గురవుతుందని, ఇప్పటికీ చాలామందికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని, 2018లో కట్టుకున్న ఇళ్లకు ఇప్పటికీ బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ముంపునకు గురైన సందర్భంలో సానుభూతి ప్రకటించడం తప్ప పరిహారం ఇవ్వలేదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఇంతవరకు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కాకపోవడం దుర్మార్గమని, ముంపునకు గురైన ప్రతి సందర్భంలో ఎమ్మెల్యేలు, మంత్రులు వచ్చి పరిశీలన చేసి వెళ్లిపోవడం తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ఎమ్మెల్యే వచ్చి పరిశీలన చేసినందుకు అభినందిస్తున్నామని, బడ్జెట్లో కేటాయింపులు లేకుండా ఎలా తోటపల్లి నిర్వాసితల సమస్యలు పరిష్కారం చేస్తారో ఎమ్మెల్యే చెప్పాలని ప్రశ్నించారు. ఇక్కడున్న పరిస్థితులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు మాట్లాడుతూ నిర్వాసితుల పోరాటం వల్ల ఎంతో కొంత న్యాయం జరిగిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వై నాయుడు ఉన్నారు.



తోటపల్లి నిర్వాసిత గ్రామమైన బాసంగిలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

గాంధీ విగ్రహం తలనరికిన ఆకతాయిలు

ప్రజాశక్తి -సాలూరు

గాంధీ జయంతి రోజున గాంధీ విగ్రహం తలను ఆకతాయిలు ధ్వంసం చేయడం చర్చనీయాంశమైంది మండలం లోని మామిడిపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలోకి గురువారం రాత్రి చొరబడిన 9 మంది యువకులు మద్యం మైకంలో గాంధీ విగ్రహం తలను తీసి ఆనందపడ్డారు. మత్తు పదార్థాలకు బానిసగా మారుతున్న యువత ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలకు, ఆకృత్యాలకు పాల్పడతారో ఈ ఘటనే నిదర్శనం అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు రాత్రి 10 గంటలు దాటాక పాఠశాల ఆవరణలోకి కొందరు యువకులు చొరబడి విలువైన ఫర్నీచర్లను, తలుపులను, కిటికీలు,ఫ్యాన్లు, విలువైన సామాగ్రిని ధ్వంసం చేస్తూ, వాటిని బయటకు పారేయడం వంటి పనులు చేస్తున్నారు. వీరిని గ్రామస్తులు మందలిస్తూ వివిధ రకాలైన హెచ్చరికలు జారీ చేస్తున్నా వారి ఆకృత్యాలు ఆగడం లేదు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనానికి ఉంచిన వంటగదిని తలుపులు బద్దలు కొట్టి వంట గదిలోనున్న పప్పు దినుసులు, గుడ్లను, బియ్యాన్ని బయట పారబోశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకట్రావును వివరణ కోరగా గత కొన్నేళ్లుగా పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుకుం టామని చెప్పడంతో అనుమతిస్తున్నా మని తెలిపారు. కానీ వారితో పాటు మరికొందరు మిగతా సమయాల్లో తాగి వచ్చి పాఠశాలలో ఉన్న వివిధ రకాలైన వస్తువులను చిందరవందగా చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల వాచ్మెన్ మధ్యాహ్న వంట నిర్వాహకులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈఘటనకు బాధ్యులపై చర్య తీసుకుంటామని సిఐ పి.రామకృష్ణ తెలిపారు.



సరుకులను చెల్లాచెదురు చేసిన దుండగులు



దుండగులు తలనరికిన గాంధీ విగ్రహం

విద్యార్థులందరికీ నాణ్యమైన వైద్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

పచ్చకామెర్లు బారిన పడిన విద్యార్థులందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. శుక్రవారం కురుపాంలోని శివ్వన్నపేటలో గల బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం వైద్య, పాఠశాల సిబ్బందికి విద్యార్థినుల ఆరోగ్య వివరాలను అడిగి వారి అస్వస్థతకు గల కారణాలు ఆరా తీశారు. విద్యార్థినులు, తల్లిదండ్రులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన విజయవాడ బృందం

మండలంలోని శివన్నపేట పరిధిలో గల ఎపి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఇటీవల జరిగిన విద్యార్థుల అస్వస్థత పరిణామాల కారణాలను పరిశోధించేందుకు రాజధాని విజయవాడ నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన బృందం శుక్రవారం వచ్చింది. పాఠశాల ప్రస్తుతం దసరా సెలవులు అయినప్పటికీ పరిసర ప్రాంతాల్లో బ్రీడింగ్ ఉనికిని పరిశోధించారు. జెడి డాక్టర్ మల్లీశ్వరి పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి పిల్లలకు అవసరమైన పచ్చకామెర్ల టెస్టులను పరిశీలించి తగిన సలహాలు అందించారు. విస్తరణాధికారి హరి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరిగినప్పుడే ఇలాంటి ఎపిడమిక్‌లు రాకుండా ఉంటాయన్నారు. హాస్టల్ వార్డెన్ పార్వతీశంను విద్యార్థుల ఆరోగ్య వివరాలను అడిగి వారి అస్వస్థతకు గల కారణాలు ఆరా తీశారు. జిల్లా మలేరియా అధికారి మణి మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్థితికి కలుషిత నీరే కారణమని, మలేరియా లక్షణాలు ఎవరికీ లేవని నిర్ధారణ పరీక్షల్లో తేలిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి : ఎస్ఎఫ్ఐ,



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న గిరిజన సంఘం నాయకులు సీతారాం

గిరిజన సంఘం

పచ్చకామెర్లు బారిన పడిన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని పాఠశాల కమిటీ చైర్మన్ కె.సీతారాం, ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, అనిల్, గంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల సందర్శనకు వచ్చిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో వారు మాట్లాడుతూ పాఠశాలలో 5 నుంచి 12 వ తరగతి వరకు 611 మంది విద్యార్థినిలు చదువుతున్నారని, వీరిందరికీ కేవలం 16 గదులు మాత్రమే ఉన్నాయని, వసతి గృహం నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని ఫిర్యాదు చేశారు. అలాగే విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి సారించడానికి ప్రిన్సిపాల్‌ను, ఎఎన్ఎంలను నియమించాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తమ మొదటి సంతకం హామీ అమలు చేయాలని, మినరల్ వాటర్ ప్లాంట్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తమ ఆధ్వర్యంలో ఉన్న పనులు త్వరగా పూర్తిచేస్తామని మిగతా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

20 ఏళ్లుగా ముంపే

బాసంగి గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత 20 ఏళ్ల నుంచి తుఫాను వచ్చిందంటే చాలు నాగావళి నది పొంగి వరద నీరు గ్రామంలోకి రావడంతో 42 కుటుంబాలు నీట మునుగుతున్నాయని జియమ్మవలస మండలం బాసంగి గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గురువారం భారీ వర్షాలకు వరద నీరు గ్రామంలో చేరడంతో ఇళ్లు, పాఠశాల భవనాలు ముంపునకు గురయ్యాయి. ప్రతి ఏటా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 108 వచ్చే సౌకర్యం కూడా లేదని దూరంగా ఉన్న రోడ్డు మార్గానికి తీసుకువెళ్లి గర్భిణీలను ఎక్కించాల్సి వస్తుందని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి, శాశ్వత పునరావాస ఏర్పాట్లు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ముంపు పొలాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - భామిని

మండలంలోని సింగిడి బత్తిలి, నేరడి, పెద్దదిమిలి, బాలేరు గ్రామాలలో నీట మునిగిన పత్తి, మొక్కజొన్న పంట పొలాలను శుక్రవారం సబ్ కలెక్టర్ పవర్ స్వప్న జగన్నాథం పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్ట వివరాలను సేకరించాలని సూచించారు. స్థానిక రైతులతో మాట్లాడి పంట నష్టం అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అలాగే బత్తిలి, నేరడి, సింగిడి, బిల్లుమడ, బాలేరు, కొసలి, చినదిమిలిలో నీట మునిగిన పత్తి, మొక్క జొన్న పంట పొలాలను, ఉద్యాన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ పరిశీలించారు. మండలంలో సుమారు పత్తి, మొక్కజొన్న ఉద్యానవన పంటలు కలిపి 2000 ఎకరాల్లో నష్టం జరిగి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కొల్లి తులక్ తెలిపారు. మండలంలో పంట నష్ట వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించి, ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి, విఎఎలు తేజ, నిఖిల్, ఈశ్వర్ ఉన్నారు.

9 శిశు సంరక్షణ కేంద్రాలు గుర్తింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 9 శిశు సంరక్షణ కేంద్రాలను గుర్తించినట్టు కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన ఛాంబర్లో శిశు సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ లోప పోషణ, రక్తహీనత కలగకుండా పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. సంరక్షణ కేంద్రాలు ఎప్పుడు శుభ్రంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గుర్తించి మంజూరు చేసిన అనుమతి పత్రాలను జిల్లా కలెక్టర్ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి టి. కనక దుర్గ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ అనంత లక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, బాలల సంక్షేమ సమితి సభ్యులు చిట్టిబాబు, రక్షణ అధికారి ప్రసాద రావు, 9 శిశు సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మాతుమూరు, పాంచాలిలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులు అధికారులు ప్రారంభించారు. సాలూరు ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, తహశీల్దార్ డి.రవి చేతులు మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. మండలంలో 17 గ్రామ సచివాలయాల పరిధిలోని 14976 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయని, వీటిలో 1427 కొత్త స్మార్ట్ కార్డులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



కంబరలో అరటి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ప్రతి రైతుకూ పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తుఫాను కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని కంబర, కంబర వలస, చిట్టపూడివలస, దశమంతపురం, నడిమికెళ్ల తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. కంబరలో 380ఎకరాలు, దశమంతపురంలో 20, నడిమికెళ్ల గ్రామంలో 20 ఎకరాలు, చిట్టిపూడివలసలో 80 ఎకరాల్లో అరటి, చిట్టిపూడివలసలో 70 ఎకరాలు మొక్కజొన్న పంట నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. ప్రతి రైతుకు పంట నష్ట పరిహారం అందేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతు పేరు నమోదు చేయాలని, పదేపదే క్షుణ్ణంగా పరిశీలించి జాబితాలు తయారుచేసి తనకు కూడా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, బల్ల హరిబాబు, టి.రమేష్, జి.గౌరునాయుడు, జె.చంద్రశేఖర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సత్యనారాయణ రెడ్డి, స్థానిక అధికారి జయశ్రీ, కుమిలి లక్ష్మణ్, ఎం వెంకటరమణ, రైతులు ఉన్నారు.

'జిఎస్‌టి తగ్గింపుతో ప్రయోజనకరం'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిఎస్‌టి తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని జిల్లా అధికారి జ్ఞాన ప్రసనంబ అన్నారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామాల్లో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన నిర్వహించారు. జిఎస్‌టి తగ్గింపుతో కలుగు ప్రయోజనాలు, లాభాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాస్, జిఎస్ టిఒ తిరుపతి, ఎఇఒ విజయ్‌కుమార్, ఎంపిడిఒ ఎల్ శ్రీనివాసరావు, ఐకెపి ఎపిఎం సతీష్ తదితరులు ఉన్నారు.

పంట నష్టాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో గురువారం రాత్రి కురిసిన అధిక వర్షాలకు, గాలులకు నష్టపోయిన పంటలను కర్రివలస, పాచిపెంట, పద్మాపురంలో పంట నష్టాలను మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు పరిశీలించారు. గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది అందరూ గ్రామాల్లో జరిగిన పంట నష్టాలను తెలుసుకొని వర్షాలు తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేయాలని సూచించారు. కేరంగి, తుమరవిల్లి, పర్సాపురం, పెదకంచూరులో 171 ఎకరాల్లో మొక్కజొన్న గాలులకు నేలకొరిగింది. అలాగే అరటి పంట కూడా నేలకు ఒరిగింది. నిబంధనల ప్రకారం పంట నష్టాలు అంచనా వేస్తున్నామని తెలిపారు. నష్టపోయిన పంటలు తప్పనిసరిగా ఇ- పంటలో నమోదై ఉండాలని, కాబట్టి రైతులంతా తప్పనిసరిగా ఇ- పంట నమోదు చేసుకోవాలని కోరారు.



కల్పన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

కల్పన కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గుమ్మిడి గూడ పంచాయతీ దండుసుర గ్రామానికి చెందిన విద్యార్థి తోయిక కల్పన బుధవారం మతి చెందిన సంఘటన తెలుసుకున్న గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిడ్డికి అనిల్ శుక్రవారం విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించి విద్యార్థి మతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వరద ముంపు బాధితులకు , నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. జియమ్మవలస మండలం బాసంగిలో శుక్రవారం ఆమె పర్యటించారు. వరద బాధితులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. గ్రామంలో తాగు నీరు క్లోరినేషన్, శానిటేషన్ చేయాలని, మెడికల్ క్యాంప్, వెటర్నరీ క్యాంప్, ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, జియ్యంవలస మండల టిడిపి అధ్యక్షులు జోగి భుజంగరావు, నాయకులు దత్తి లక్ష్మణరావు ఉన్నారు.

గిజబ ఎంపిటిసికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం గిజబకు చెందిన ఎంపిటిసి సింహాచలంను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం పరామర్శించారు. కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయం తెలుసుకున్న ఆమె ఆయన స్వగ్రామానికి వెళ్లి ధైర్యంగా ఉండాలని, పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

డాన్స్ రాజా డాన్స్ విజేతగా మూలలంక

సీతంపేట : మండలంలోని ధోనుబాయిలో దసరా నవరాత్రుల్లో భాగంగా సర్పంచ్ కోరంగి వెంకినాయుడు ఆధ్వర్యంలో డ్యాన్స్ రాజా డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం మూలంక గ్రామం దక్కించుకుంది. ద్వితీయ స్థానం మొండింఖల్, తృతీయ స్థానం జల్లారా టీమ్‌లు గెలుపొందాయి. వీరికి షీల్డ్‌తో పాటు నగదు కూడా అందజేశారు. వరుసగా ప్రథమ స్థానానికి రూ.15వేలు, ద్వితీయ స్థానానికి రూ.10వేలు, తృతీయ స్థానానికి రూ.7వేలు అందజేశారు. అదేవిధంగా బెస్ట్ డాన్సర్ టీంకు రామయ్య గూడకు దక్కింది. ఈ పోటీలకు జడ్జిగా స్థానిక ఉపాధ్యాయులు నిమ్మక సంగమేశ్వర, నిమ్మక రవి, యాంకర్‌గా కోరంగ రవి వ్యవహరించారు.

సిహెచ్‌డబ్ల్యుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్‌కు సిఐటియు ఆధ్వర్యాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు వి ఇందిరా, నాయకులు ఎం.శివాని, కె.గౌరీశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పని భారం పెంచుతూ విపరీతమైన ఒత్తిళ్లకు గురిచేస్తోందని చెప్పారు. పని చేయించుకుంటున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. పైగా ఇచ్చిన నాలుగు వేలు కూడా ప్రతినెలా ఇవ్వకపోవడంతో అప్పుల పాలై ఇంటిదగ్గర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో వెంటనే పెండింగ్ ఉన్న 3 నెలల జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలు చేయాలని, ఉపాధిహామీ పనులు కల్పించాలని, టిఎ డిఎలు ఇవ్వాలని, యూనిఫారంతో పాటు ఐడెంటిటీ కార్డు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహాలక్ష్మి, ఎం.శిరీష, జి.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎపిఒకు వినతిని అందజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

వట్టిగెడ్డ రహదారిపై వంతెన నిర్మించాలి

గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం రావాడ ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రధాన రహదారిపై వంతెన నిర్మించాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు శుక్రవారం నిరసన తెలిపారు. వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్ నిండడంతో గేట్లు తెరిచి నీటిని విడుదల చేయడంతో ప్రధాన రహదారిపై ఒక్కసారిగా వరద ప్రవాహం పెరుగుతుందని దీంతో గిరిజన రాకపోకలకు ఆటంకంగా మారుతుందని ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ తెలిపారు. తూర్పు ముఠాలో ఉన్న 30 గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. వరద ప్రవాహంతో బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగినట్లేనని, ఇలాంటి సమయంలో గిరిజనులకు వైద్య ఆరోగ్య సమస్యలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడి మరణాల సంభవించే అవకాశం ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యపై అనేకసార్లు అధికారులు, పాలకులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, పాలకులు, అధికారులు స్పందించి ఒట్టిగెడ్డ రహదారిపై కాజ్ వే నిర్మించాలని కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న స్థానిక గిరిజనులు

అంతర్‌రాష్ట్ర రహదారికి అడ్డంగా నేలకొరిగిన చెట్లు

ప్రజాశసాలూరు:

భారీ గాలులకు ఈదురు గాలులకు మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల కొటియా గ్రామాలకు ప్రధాన రహదారైన కొడతాము - కొడికారు మీదుగా కొడము వెళ్లే రహదారిలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో గిరిజనులు మైదాన ప్రాంతాలకు రావడానికి చాలా ఇబ్బందులకు గురయ్యారు. గ్రామస్తులే స్పందించి చెట్లను తొలగించారు.

వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా జయమణి

ప్రజాశక్తి - సీతానగరం



మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు సవరపు జయమణికి వైసిపి రాష్ట్ర వ్యవహారాల కౌన్సిల్ మెంబర్ పదవీ బాధ్యతలను గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జయమణి మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు, ఉత్తరాంధ్ర వైసిపి కో-ఆర్డినేటర్ కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అంపిలిలో భూ రీసర్వే

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో అంపిలిలో శుక్రవారం నుంచి భూరీసర్వే మొదలైంది. తొలుత గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ రీసర్వే సహకరించి రైతులు తమ భూములు వివరాలను స్పష్టంగా పొందుపర్చుకోవాలన్నారు. పక్కాగా ఈ సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వాకముడ అనిల్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు, సర్పంచ్ విశ్వేశ్వరరావు, ఆర్ఎస్‌డిటి సన్యాసిరావు, విఆర్ఒ బి.రాజా తదితరులు ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సిపిఎం నాయకులు వై.మన్మధరావు అధికారులను కోరారు. ప్రభుత్వం లక్షలాది రూపాయల ఖర్చుపెట్టి చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మించిందని, అయితే అవి ఇప్పుడు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో చెత్తను సేకరించిఫ గ్రీన్ అంబాసిడర్లకు నెలవారీ జీతాలు ఇవ్వలేదన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి ఎరువుగా తయారు చేసి, వాటి వల్ల వచ్చే ఆదాయం గ్రామాలకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెబుతున్నా ఆదిశగా జరగడంలేదన్నారు. మండలములో 21 పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం పూర్తయినా, ఏ సంపద కేంద్రంలోనూ చెత్తను సేకరించలేదన్నారు. కావున అధికారులు స్పందించి గ్రీన్ అంబాసిడర్లకు నెలవారీ వేతనాలు చెల్లించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఒకరి మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని జగత్‌పల్లి మలుపు వద్ద అదుపుతప్పి ద్విచక్ర వాహనం గురువారం బోల్తా పడింది. ఈ సంఘటనలో సాహిని సాయికృష్ణ (28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండలోని కోట దుర్గమ్మ వెనుక వీధికి చెందిన సాహిని సాయికృష్ణ, బూరి అభిలాష్ ద్విచక్ర వాహనంపై బుధవారం జగత్ పల్లి యూ పాయింట్ సందర్శించారు. సాయంత్రం వస్తుండగా జగత్‌పల్లి కొండ దిగుతుండగా మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వెనుక కూర్చొన్న సాయికృష్ణ తలకు బలమైన గాయం తగిలింది. వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై అమ్మన్నరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. దసరా ఉత్సవాల కోసం వచ్చి సరదాగా జగతి పల్లి చూడ్డానికి వచ్చి మృతువాతపడడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం లను నియమించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేసిన ఫైలు అమలు చేయాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో వారు మాట్లాడారు. గతంలో గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలో సుమారు 200 మంది ఎఎన్ఎంలు పని చేసేవారని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లోని పిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా పరీక్షలు చేసి వైద్యం చేసేవారని చెప్పారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం జిల్లా ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేసేవారని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో పిల్లల యోగక్షేమాలు చూస్తూ ఉండేవారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయాంలో వారిని తొలగించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశ్రమ పాఠశాలలో మళ్లీ ఎఎన్ఎంలను నియమిస్తామని గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాలేదని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, ఎన్ వై నాయుడు, వి ఇందిరా పాల్గొన్నారు.

అన్యాయం జరిగిన వారికి అండగా డిజిటల్ బుక్

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ప్రజాసంక్షేమాన్ని విస్మరించి కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రానున్నాయని, పార్టీ శ్రేణులకు ప్రజలకు రక్షణగా వైసిపి ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ అందుబాటులోకి తీసుకువచ్చామని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం రాముడి పాలన రెడ్ బుక్ రాజ్యాంగం రావణాసురుడు పాలన అని విమర్శించారు. కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైసిపి కార్యకర్తలు, సామాన్య ప్రజల కోసం పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి కొద్ది రోజులు క్రితం డిజిటల్ బుక్‌ను విడుదల చేశారని తెలిపారు. వైసిపి శ్రేణులను ఇబ్బంది పెట్టే వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని, అధినేత జగనన్న అండగా ఉంటారని పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలలుగా అరాచక పాలన సాగుతోందని అన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అధికారులపై భవిష్యత్‌లో చర్యలు ఖాయమన్నారు. వైసిపి కార్యకర్తలకు ఎవరికి అన్యాయం జరిగినా 'డిజిటల్ బుక్'లో నమోదు చేయవచ్చన్నారు. 'డిబి.డబ్ల్యుఇవైయస్ఆర్‌సిపి.కామ్' అనే వెబ్‌సైట్‌లో గానీ, 040-49171718 నంబర్‌కు గాని కాల్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో మక్కువ మండల జడ్‌పిటిసి మావుడి శ్రీనివాస్ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి ప్రజా ప్రతినిధులు, వైసిపి అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి బాధాకరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థిని తోయక కల్పనకు అవసరమైన చికిత్స అందించి, మెరుగైన చికిత్స కొరకు కెజిహెచ్‌కు రిఫర్ చేసినప్పటికీ దురదృష్టవశాత్తు మృతి చెందిందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈనెల 2న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన పర్యవేక్షణ లోపం..విద్యార్థులకు శాపం కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. కురుపాం మండలం దండుసూరుకు చెందిన తోయక కల్పన (14) గత నెల 21న కడుపు నొప్పి, వాంతులని చెప్పగా ఎంఎల్‌హెచ్‌పి సూచనల మేరకు ఆశా వర్కర్ ఆమెకు మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆమె తల్లి సెప్టెంబర్ 22న కురుపాం సిహెచ్‌సికి తీసుకువెళ్లగా, ఆమెను ఆసుపత్రిలో చేర్చిన పిదప రోగ లక్షణాలకు చికిత్సను అందించామన్నారు. ఆ తదుపరి ఆమె పూర్తిగా కోలుకున్నట్టు తెలిపారు. అనంతరం 24న ఆమెకు రక్తపరీక్ష నిర్వహించగా ప్రతికూలంగా వచ్చిందని, తదుపరి చికిత్స కోసం అదే రోజున ఆమెను పార్వతీపురం జిల్లా ఆసుపత్రి రిఫర్ చేయగా, జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు ఆమె నిరాకరించగా, 25న హెపాటిక్ ఎన్సెఫలోపతి కేసును విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి రిఫర్ చేశారన్నారు. అక్కడ ఆమెకు హెపాటిక్ ఎన్సెఫలోపతి, మెనింజైటిస్ చికిత్స జరిగిందని, తదుపరి చికిత్స కోసం కెజిహెచ్‌కు తరలించినట్టు తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు ఆమె అక్టోబర్ 1న కెజిహెచ్ వద్ద మరణించినట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

కౌలు రైతులకు పెద్ద కష్టం.. తుపాను మిగిల్చిన నష్టం..

ప్రజాశక్తి -కొమరాడ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రైతులతో పాటు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు ప్రభుత్వం కొంతమేరకు ఆర్థికసాయం అందజేస్తున్నప్పటికీ కౌలు రైతులకు మాత్రం ఎటువంటి ఆర్థిక సహాయం అందకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. తుఫాన్ నేపథ్యంలో అరటి, మొక్కజొన్న, వరి ఇతర పంటలన్నీ ముంపునకు గురవ్వడంతో తీవ్ర నష్టం వాటిలిందని కౌలు రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కౌలు రైతు ఎం.సుబ్రహ్మణ్య చౌదరికి చెందిన చిన్నకేర్జల పంచాయతీ పెద్దవలసలో 23 ఎకరాలు, కల్లికోట, దేవునిగుంపలో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేసిన అరటి పూర్తిగా నేలమట్టం అయింది. అలాగే అనేక మంది కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు పంట నష్ట పరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

7న భామినిలో జాబ్ మేళా

పార్వతీపురం : ఈ నెల 7న భామినిలో గల ఎపి మోడల్ స్కూల్‌లో నందు జాబ్ మేళా జరగనుందని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందని, పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 30 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులంతా ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశానికి హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63012 75511 లేదా 9000308185 సంప్రదించాలని వివరించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-సీతంపేట

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు, కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో గ్రామాల్లో మూడు రోజులుగా గిరిజనులు చీకట్లోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. గురువారం ఎడతెరిపి లేని వర్షం కురవడంతో చుట్టుపక్కల గెడ్డలు వాగులు పొంగి పొర్లడంతో కుసిమి చంద్రమ్మ గెడ్డలు వద్ద రోడ్డుపై నీరు ప్రవహించింది. గుమ్మడ పరిసర ప్రాంతాల్లో చెట్టు నేలకొరగడంతో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి పో యాయి. దెబ్బ గూడలో శ్రీను అనే రైతుకు 50 సెంట్లు వరకు అరటితోట నేలకొరగడంతో నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా విద్యుత్తు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

3 రోజుల వరకు తాగునీరు బంద్

పార్వతీపురం టౌన్: పట్టణంలో మూడురోజులు పాటు తాగునీటి సరఫరా జరగదని మునిసిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు తోటపల్లి రిజర్వాయర్ నుంచి వరద నీరు విడుదల చేయడంతో రిదిగువ ప్రాంతంలో ఉన్న ఇన్ ఫిల్టర్ రేషన్ బావులు నీటి మునిగాయన్నారు. దీంతోపట్టణ ప్రజలకు 2 లేదా 3 రోజుల వరకు తాగునీటి సరఫరా జరగదని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పార్వతీపురం జిఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం నర్సిపురానికి చెందిన చందాన సింహాచలం (59) శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో తన ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్తూ నర్సిపురం రైల్వే స్టేషన్ ఎల్విగేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మతి చెందాడు. సమాచారం అందుకున్న పార్వతీపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. జిఆర్పి హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సరుకుల ఇళ్ల తీసుకెళ్లేందుకు ఆటోకు కోసం నిరీక్షిస్తున్న గిరిజనులు

రేషన్ కోసం గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ పరిధిలోని నాయుడువలస గిరిజనులు రేషన్ బియ్యం కోసం అవస్థలు పడుతున్నారు. తోటవలస నుంచి సుమారు 2కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి రేషన్ బియ్యాన్ని ఆటోలో తీసుకొని వెళ్లాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు. గోముఖీనది ఉధృతంగా ప్రవహించడంతో మరింత ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని వారంతా ఆవేదన చెందుతున్నారు. గతంలో సుమారు 30 కుటుంబాలు నివసించే గ్రామంలోకి బియ్యం వాహనం వచ్చేదని, అప్పుడు ఎవరికీ ఇబ్బంది లేకుండా పోయిందని, ఇప్పుడు పనులు మానుకొని రేషన్ కోసం రావాల్సి వస్తుందని వారంతా అంటున్నారు. తమ గ్రామానికి వచ్చి కార్డుదారులకు రేషన్ అందేలా పభుత్వం చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



అధ్వాన్నంగా ఉన్న వంగర-గుడివా కొట్టిశ కాలనీ రోడ్డు

అధ్వాన రహదారితో అవస్థలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పలగర-గుడివాడ కొట్టిశ కాలనీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో కాలనీ వాసులకు రహదారి లేక నానా అవస్థలు పడుతున్నారు. గుడివాడ కొట్టిశలో సుమారు 400 కుటుంబాలు ఒక కాలనీగా వంగర మండలం మడ్డువలస రిజర్వాయరు నిర్వాసితులకు ఏర్పాటు చేశారు. వీరికి ప్రత్యేకంగా ఒక పాఠశాల ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఈ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేక విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీ నుంచి మండల కేంద్రమైన బలిజిపేట వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో తమ కాలనీకి ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఉందన్నారు. తమ కాలనీకి అవసరమైన పలగర ఎస్సీ కాలనీ వాటర్ ట్యాంక్ నుంచి నిర్వాసిత గుడివాడ కొట్టిశ పాఠశాల వరకు రహదారిని నిర్మించాలని అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.